సాక్షి నంద్యాల

గురువారం : 15 : జూన్ : 2023



రూ. 94.14 లక్షల ఆదాయం

ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను రెండో రోజు బుధవారం లెక్కించగా నగదు రూపంలో రూ. 94,14,970 వచ్చాయి.



చేపల పెంపకం యూనిట్

రాష్ట్రంలో తొలిసారిగా బనవాసి కృషి విజ్ఞాన కేంద్రలో రూ. 7 లక్షల వ్యయంతో చేపల పెంపకం యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పనులు ఈ నెలాఖరు లోపు పూర్తికానున్నాయి. 4లో▸



ఎరువులు సిద్ధం

ఖరీఫ్ సీజన్ మొదలైన నేపథ్యంలో రైతుల అవసరార్థం 7,6553 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉంచినట్లు జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. 4లో▸

ర్యాంకుల పంట.. భవితకు బాట

- ఏపీ ఈఏపీ సెట్‌లో సత్తా చాటిన ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యార్థులు
- రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకుల సాధన
- ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో 11,828, అగ్రికల్చర్, ఫార్మసీలో 7,940 మంది అర్హత

ఒకరు ఇంజినీర్ కావాలని కలగంటే.. మరొకరు అగ్రికల్చర్ ఆఫీసరై ప్రజలకు సేవ చేయాలని సంకల్పించారు. ఇందు కోసం పదో తరగతి నుంచే పక్కా ప్రణాళిక రూపొందించుకున్నారు. ఇంటర్‌లో తమ అభిరుచికి అనుగుణంగా కోర్సుల్లో చేరి చక్కని ప్రతిభ కనబరిచారు. ఏపీఈఏపీ సెట్ (ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్)లో మంచి ఫలితం సాధించి తమ భవిష్యత్తుకు బాటలు వేసుకున్నారు.



కర్నూలు సిటీ/నంద్యాల(న్యూటౌన్): ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. వేల మందితో పోటీ పడాలి. మంచి కాలేజీలో సీటు సాధించాలి. ఉన్నతంగా ఎదగాలి. ఊరితోపాటు తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలి. ఇందుకోసం వారు కష్టాన్ని ఇష్టంగా భరించారు. రెండు సంవత్సరాల ఇంటర్‌మీడియట్ కోర్సు పూర్తి చేసుకుని తమకు నచ్చిన రంగంలో స్థిరపడేందుకు ఏపీ ఈఏపీ సెట్ రాశారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో వీరి కష్టానికి తగిన ప్రతిఫలం లభించింది. రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు వచ్చాయి. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం(అనంతపురం), ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా ఏపీ ఈఏపీ సెట్‌ను నిర్వహించాయి. ఫలితాలను బుధవారం విజయవాడలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ విడుదల చేశారు. ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలకు కర్నూలు జిల్లాలో 8,723 మంది విద్యార్థులు హాజరుకాగా.. 6,670 మంది అర్హత సాధించారు. నంద్యాల జిల్లాలో 4,154 మంది హాజరుకాగా 3,105 మంది అర్హత సాధించారు. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు కర్నూలు జిల్లాలో 6,800 మంది హాజరుకాగా 6,057 మంది, నంద్యాల జిల్లాలో 2,093 మందికి గాను 1,883 మంది అర్హత పొందారు. ఇంజినీరింగ్ పరీక్షకు సంబంధించిన ప్రాథమిక 'కీ' గత నెల 23వ తేదీ అర్ధ రాత్రి, అలాగే అగ్రికల్చర్, ఫార్మసీ స్ట్రీమ్ పరీక్ష కీని 24వ తేదీన విడుదల చేశారు. ప్రాథమిక కీపై 26వ తేదీ ఉదయం 9 గంటల వరకు అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించారు. ఇంటర్మీడియెట్, దానికి సమానమైన కోర్సుల్లో పొందిన మార్కులకు 25 శాతం వెయిటేజీను కలిపి ఈ ఏడాది ర్యాంకులను ప్రకటించారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో టాప్ ర్యాంకర్లు వీరే..

- ఇంజినీరింగ్ విభాగంలో కర్నూలు జిల్లాకు చెందిన విద్యార్థి ఎస్.జోయల్ టెన్నీ 51, బండ్ల సోమనాథ్ వసంత యాదవ్ 69, రామ్‌శెట్టి హర్షవర్ధన్ 74, జక్కల నాగ రోహిత్ కుమార్ 125 ర్యాంకులు సాధించారు. నంద్యాల జిల్లాకు చెందిన నంద్యాల ప్రిన్స్ బ్రహ్మంరెడ్డి 39, వై.రామమనోజ్‌కుమార్ 151, కొమ్మిరెడ్డి జయంతి 190 ర్యాంకులు సాధించారు.
- అగ్రికల్చర్, ఫార్మసీ, బీఎస్సీ(నర్సింగ్)విభాగంలో కర్నూలు జిల్లాకు చెందిన పి.పవన్ సిదార్థ్ 35, ఆసిఫియా అనం 84, పి.పంక్షజాక్షి 160, ఎం.అస్తముస్కాన్ 174, కురువ సాయి ముకేష్ 175వ ర్యాంకు సాధించారు. నంద్యాల జిల్లాకు చెందిన ఎస్.శ్రావణ్య 77, సింగారెడ్డి శ్రీవైష్ణవి 79, యాదగిరి గౌరి ప్రియా 149, సి.వర్షిత 184వ ర్యాంకు సాధించారు.



విద్యార్థి: పి.పవన్ సిద్ధార్థ్
తల్లిదండ్రులు: పి.తులసమ్మ, పూల వీరేష్
స్వస్థలం: ఎమ్మిగనూరు
ర్యాంకు: 35 (నీట్‌లో 22వ ర్యాంక్)
లక్ష్యం: కార్డియాలాజిస్టు కావడం



విద్యార్థి: బ్రహ్మం రెడ్డి
తల్లిదండ్రులు: నాగేశ్వరమ్మ, మహేశ్వర్ రెడ్డి
స్వస్థలం: ఎన్‌జీఓ కాలనీ, నంద్యాల
ర్యాంక్: 39
లక్ష్యం: ఐఐటీ కంప్యూటర్ సైన్స్



విద్యార్థి: సత్రుల జోయల్ టెన్నీ
తల్లిదండ్రులు: ఎస్.సునీత, జె.సత్రుల జోహరా రాజు
స్వస్థలం: కర్నూలు
ర్యాంకు: 51
లక్ష్యం: కంప్యూటర్ సైన్స్ చదవి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం



విద్యార్థి: బండ్ల సోమనాథ్ వసంత యాదవ్
తల్లిదండ్రులు: తులసమ్మ, మురళీకృష్ణ
స్వస్థలం: నంద్యాల
ర్యాంకు: 69
లక్ష్యం: ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవడం



విద్యార్థి: ఆర్.హర్షవర్ధన్
తల్లిదండ్రులు: ఆర్.శ్రీలక్ష్మి, ఆర్.రవి శంకర్
స్వస్థలం: డోన్ ర్యాంకు: 74
లక్ష్యం: ముంబాయి/చెన్నై ఐఐటీల్లో కంప్యూటర్ సైన్స్ చదవడం



విద్యార్థి: రామ మనోజ్ కుమార్ రెడ్డి
తల్లిదండ్రులు: భాగ్యలక్ష్మి, రామసుదర్శన్ రెడ్డి
స్వస్థలం: రామాపురం గ్రామం, అవుకు మండలం
ర్యాంక్: 151 లక్ష్యం: ఐఐటీ ఇంజినీరింగ్



విద్యార్థి: యశ్వంతి రెడ్డి
తల్లిదండ్రులు: సుధారాణి, వెంకటేశ్వర రెడ్డి
స్వస్థలం: ఎన్‌జీఓస్ కాలనీ, నంద్యాల
ర్యాంక్: 330
లక్ష్యం: ఐఐటీ ఇంజినీరింగ్ (గూగుల్ లో ఉద్యోగం)



విద్యార్థి: టి.సంజీవ్ వర్ధన్
తల్లిదండ్రులు: భారతి, సంజీవ రాయుడు
స్వస్థలం: జ్ఞానాపురం, నంద్యాల
ర్యాంక్: 388 లక్ష్యం: సివిల్స్



విద్యార్థి: వై మాధవ రెడ్డి
తల్లిదండ్రులు: లక్ష్మీదేవి, చంద్రా రెడ్డి
స్వస్థలం: ఎబీఐ కాలనీ, నంద్యాల
ర్యాంక్: 502
లక్ష్యం: ఐఐటీ ఇంజినీరింగ్



విద్యార్థి: పి. సిద్దార్థ రాయల్
తల్లిదండ్రులు: విజయలక్ష్మి, ఆనంద్
స్వస్థలం: పాణ్యం
ర్యాంక్: 558
లక్ష్యం: ఐఐటీ, సివిల్స్



విద్యార్థి: నల్లవల్లి గణేష్
తల్లిదండ్రులు: జయలక్ష్మి, మల్లికార్జున
స్వస్థలం: కరివేన గ్రామం
ర్యాంక్: 763
లక్ష్యం: బీటెక్, ఇంజినీరింగ్



విద్యార్థి: కే జయంతి
తల్లిదండ్రులు: రామ తుల శమ్మ, నారాయణ రెడ్డి
స్వస్థలం: రెడ్డి పల్లె గ్రామం, సంజామల మండలం
ర్యాంక్: 190
లక్ష్యం: ఐఐటీ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్

న్యూస్‌రీల్

కొలనుభారతిలో సామూహిక అక్షరాభ్యాసం



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: కొలనుభారతి క్షేత్రంలో బుధవారం ఏకాదశిని పురస్కరించుకొని సరస్వతీ అమ్మవారి సన్నిధిలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు ఇక్కడికి చేరుకుని తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించుకున్నారు. మొదట అమ్మవారిని దర్శించుకొని కుంకుమార్చన, పుష్పార్చన, మంగళహారతి వంటి విశేష పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి క్షేత్ర ప్రాంగణంలో దాదాపు 50 మంది చిన్నారులకు ఆలయ పురోహితులు ఆధ్వర్యంలో అక్షరాభ్యసం చేయించారు. అనంతరం భక్తులు సప్తశివాలయాలను దర్శించుకున్నారు.

నంద్యాల డీఈఓగా సుధాకర్‌రెడ్డి



బాధ్యతలు చేపడుతున్న డీఈఓ సుధాకర్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): జిల్లా విద్యాశాఖ అధికారిగా సుధాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఇక్కడ డీఈఓగా పని చేస్తున్న అనురాధ విద్యాశాఖ కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్‌గానే బాధ్యతలు నిర్వహించనున్నారు. బదిలీల్లో భాగంగా డోన్ డిప్యూటీ డీఈఓగా పని చేస్తున్న సుధాకర్‌రెడ్డి పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖలో పని చేస్తున్న సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించి, పేద విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. బాధ్యతలు స్వీకరించిన డీఈఓను కార్యాలయ సిబ్బంది అభినందించారు.

మహిళల రక్షణ కోసమే దిశ యాప్

బొమ్మలసత్రం: మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం దిశ యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 14, 15 తేదీల్లో దిశయాప్ మెగా డ్రైవ్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రానికి 4,778 మంది మహిళల మొబైల్ ఫోన్‌లలో దిశయాప్ డౌన్‌లోడ్ చేసి రిజిస్టర్ చేశామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాలయ మహిళా పోలీసులు పట్టణంలోని ప్రధాన కూడళ్లలో, కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థినుల మొబైల్ ఫోన్‌లలో దిశ యాప్ రిజిస్టర్ చేసి వారికి అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. దిశ యాప్‌లో ఎస్‌వోఎస్ బటన్ నొక్కగానే ప్రమాదంలో ఉన్న మహిళ వద్దకు పోలీస్ సిబ్బంది చేరుకుని రక్షణ కల్పిస్తారన్నారు.

'జగనన్న సురక్షా'ను పకడ్బందీగా నిర్వహించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం వైఎస్ జగన్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జేసీ నిశాంతి

నంద్యాల: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా ఈనెల 23వ తేదీ నుంచి నెల రోజుల పాటు నిర్వహించే 'జగనన్న సురక్షా' కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుంచి సీఎం జగన్ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. నంద్యాల కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్ఓ పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి తదితర జిల్లాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం వచ్చే వినతుల్లో సంక్షేమ పథకాలకు సంబంధించిన వాటికి ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలన్నారు. జగనన్న సురక్షాలో వివిధ పథకాల కింద అర్హులను ఎంపిక చేసి సంక్షేమ లబ్ధిని ఆగస్టు 1వ తేదీ నుంచి అందజేస్తామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ మాట్లాడుతూ ప్రజలు సంతృప్తి చెందే స్థాయిలో సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలన్నారు. సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎంపీడీవోలు, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకొని వారపు లక్ష్యాల ప్రగతి సాధనపై కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులందరూ వారంలో కనీసం సంబంధిత సచివాలయ సిబ్బంది, అధికారులతో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేసి లక్ష్య ప్రగతిపై సమీక్షించాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారులు తమ మండలాలను క్రమం తప్పకుండా సందర్శించి ప్రధానంగా హౌసింగ్, నాడు-నేడు, స్పందన, పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రాప్ అవుట్ పిల్లలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, వసతి గృహాలు తదితర అంశాలను సమీక్షించి వాస్తవ నివేదికలను ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

డీసీసీబీలో శ్రీనిధి డిపాజిట్ స్కీం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సొంత నిధులు సమకూర్చుకోవడంలో భాగంగా 525 రోజుల వ్యవధితో శ్రీనిధి డిపాజిట్ స్కీంకు శ్రీకారం చుట్టినట్లు బ్యాంకు చైర్‌పర్సన్ మహలక్ష్మి తెలిపారు. బుధవారం సాయంత్రం బ్యాంకులో ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి శ్రీనిధి డిపాజిట్ స్కీం అమలులోకి వస్తుందన్నారు. ఇందులో డిపాజిట్ చేసే సీనియర్ సిటిజన్‌లకు 7.90 శాతం(ఎఫెక్టివ్ రేట్ 8.25 శాతం), 60 ఏళ్లలోపు 7.30 శాతం(ఎఫెక్టివ్ రేట్ 7.62 శాతం) వడ్డీ చెల్లిస్తామన్నారు. ఈ డిపాజిట్ పథకం ఈ నెల 30 వరకు మాత్రమే అమలులో ఉంటుందన్నారు. డిపాజిట్‌లకు పూర్తి భద్రతతో డిపాజిట్ ఇన్సూరెన్స్ గ్యారెంటీ సదుపాయం రూ.5 లక్షల వరకు ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీఇవో పి.రామాంజనేయులు, డైరెక్టర్లు, ఆప్కాబ్ ఓఎస్‌డీ విజయకుమార్, డీజీఎంలు, ఏజీఎం తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలోనూ భగభగలే!

- పాములపాడులో 44.08 డిగ్రీల ఉష్ణోగ్రత

కర్నూలు(అగ్రికల్చర్): వర్షాకాలం మొదలై 15 రోజులవుతున్నా భానుడు భగభగ మండుతూనే ఉన్నాడు. మరో మూడు రోజుల పాటు ఎండల తీవ్రత కొనసాగే అవకాశం కనిపిస్తోంది. 17 నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవచ్చని.. శనివారం నుంచి జిల్లాలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మహదేవయ్య తెలిపారు. ఎండలు, వడగాలుల తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించినప్పటికీ విస్తరించడంలో జాప్యం జరుగుతోంది. నంద్యాల జిల్లాలో ఉష్ణోగ్రతల తీవ్రత ఎక్కువగా ఉంది. పాములపాడులో మధ్యాహ్నం 2 గంటల సమయంలో 44.08 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సమయంలో 37-38 డిగ్రీల వరకే ఉష్ణోగ్రతలు నమోదు కావాల్సి ఉంది.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్.సి ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్-2 ఉద్యోగ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

- జూన్ 18వ తేదీ (ఆదివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

కర్నూలు: ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. దాదాపు 1000 వరకు గ్రూప్-2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో.. గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో.. సాక్షిఎడ్యుకేషన్.కామ్(www.sakshieducation.com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్ కలిసి జూన్ 18వ తేదీ(ఆదివారం) ఉదయం 09:00 నుంచి 12:30 వరకు కర్నూలులోనిBAS.Kalyanamandapam,Opp.S.V.Complex, R.S.Road నందు ఉచిత అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షిఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికి తెల్సిందే. టాలెంట్ టెస్ట్ కు హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబర్‌కు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ: జూన్ 18, 2023 (ఆదివారం)

వేదిక: బీఏఎస్ కల్యాణమండపం, ఎస్‌వీ. కాంప్లెక్స్ ఎదురుగా, ఆర్ఎస్ రోడ్ కర్నూలు.

సమయం: ఉదయం 09:00 నుంచి 12:30 వరకు

76,553 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో 76553.29 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ఖరీఫ్ సీజన్ మొదలైన నేపథ్యంలో ఎరువులు, విత్తనాల కేటాయింపులు, పంపిణీ ఇతరత్రా విషయాలపై బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు 2,59,173 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించగా.. ప్రస్తుతం యూరియా 20475.47, డీఏపీ 7017.54, ఎంవోపీ 333.66, కాంప్లెక్స్ ఎరువులు 47031.27, ఎస్ఎస్‌పీ 1695.35 టన్నుల ప్రకారం అందుబాటులో ఉన్నాయన్నారు. జూన్ నెలకు సంబంధించి సప్లయ్ ప్లాన్ ప్రకారం 36,495 టన్నుల ఎరువులు జిల్లాకు రావాల్సి ఉన్నట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాకు 18,199 క్వింటాళ్ల విత్తనం కేయించగా.. ఇందులో వేరుశనగ 7,146, జీలుగ 96.4, పిల్లిపెసర 16.64 క్వింటాళ్ల విత్తనాలు 8,658 మంది రైతులకు పంపిణీ చేశామన్నారు. నాన్ సబ్సిడీ విత్తనాలైన పత్తి, మిరప, జొన్న, మొక్కజొన్న ఇతర ప్రధాన పంటల విత్తనాల పంపిణీకి ప్రభుత్వం వివిధ కంపెనీలతో ఎంఓయూ కుదుర్చుకుందని, రైతులు సంబంధిత రైతుభరోసా కేంద్రాల నుంచి ఆర్డర్ పెట్టవచ్చని తెలిపారు.

నేడు కర్నూలుకు విద్యుత్ సీఎండీ

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు గురువారం కర్నూలుకు రానున్నారు. ఆదోని, కర్నూలు విద్యుత్ డివిజన్ల సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొంటారు. ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో పాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, టెక్నికల్, కమర్షియల్, ట్రాన్స్‌ఫార్మర్స్, ఎం అండ్ పీ, కన్‌స్ట్రక్షన్స్ విభాగాలు, అకౌంట్స్ ఆఫీసర్లతో ఆయన సమావేశం కానున్నారు.

ముమ్మరంగా భూసార పరీక్షలు

- ఇప్పటికే వర్క్‌షాపు శాంపుల్స్ కింద 802 మట్టి నమూనాల సేకరణ, పరీక్షలు పూర్తి
- 2022-23 ఈ-క్రాప్ డేటా ప్రకారం జిల్లాలో 5.22 లక్షల మంది రైతులు
- ప్రతి పది మందికి ఒక భూసార పరీక్ష ప్రకారం 52,128 మట్టి నమూనాల సేకరణ
- భూసార పరీక్షలతో ఎన్నో ఉపయోగాలు


కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని భూసార పరీక్ష కేంద్రంలో మట్టి నమూనాలను పరీక్షిస్తున్న సిబ్బంది

కర్నూలు(అగ్రికల్చర్): భూసార పరీక్షలతో రైతులకు ఎన్నో ఉపయోగాలున్నాయి. దీంతో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ ఏడాది భూసార పరీక్షలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు వ్యవసాయ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఉద్యమ తరహాలో మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపే విధంగా కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే భూసార పరీక్షలపై ప్రభుత్వం జిల్లా, సబ్ డివిజన్ స్థాయిలో ఏవో, ఏడీఏ, ల్యాబ్ ఏఓలకు ప్రత్యేక వర్క్‌షాపు నిర్వహించింది. జిల్లాలో 466 రైతుభరోసా కేంద్రాలు ఉండగా.. 802 మట్టి నమూనాలు సేకరించి ఎమ్మిగనూరులోని భూసార పరీక్ష కేంద్రానికి పంపారు. మట్టి నమూనాల పరీక్షలు కూడా పూర్తి అయ్యాయి. తాజాగా పెద్ద ఎత్తున మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు నిర్వహించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న రోజుల్లో మట్టి నమూనాల సేకరణ, భూసార పరీక్షలు, రైతులకు ఫలితాలు చేరవేయడం తదితర వాటిపై వ్యవసాయ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇప్పటి వరకు రైతుభరోసా కేంద్రాల్లోనే భూసార పరీక్షలు నిర్వహించుకునే అవకాశాన్ని ప్రభుత్వం రైతులకు కల్పించింది. ఈ ఏడాది సామూహికంగా భూసార పరీక్షలు నిర్వహిస్తుండటం విశేషం.

ఉపయోగాలు ఇవీ..

- భూమిలో ప్రధాన పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మ పోషకాలైన జింక్, బోరాన్, సల్ఫర్, కాపర్, మాంగనీసు తదితరవన్నీ ఏ మోతాదులో ఉన్నాయో తెలుస్తుంది.
- మోతాదు మేరకు లేకపోతే తీసుకోవాల్సిన చర్యలను స్పష్టంగా తెలుస్తాయి.
- సేంద్రియ కర్బనం ఎలా ఉందనేది కూడా తెలుస్తుంది.
- పశువుల ఎరువు, కంపోస్ట్ వాడేందుకు వీలు ఉంటుంది.
- చౌడు నేలలు, క్షార భూముల వివరాలు తెలుస్తాయి.
- భూసార పరీక్షలతో పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకోవచ్చు. నాణ్యమైన అధిక దిగుబడులు పెంచుకోవచ్చు.

ఈ ఏడాది 52,128 భూసార పరీక్షలు...

2022-23 ఈ-క్రాప్ డేటా ప్రకారం 5.22 లక్షల మంది రైతులు ఉన్నారు. ప్రతి 10 మంది రైతులకు ఒక మట్టి నమూనా సేకరించి భూసార పరీక్ష కేంద్రాల్లో పరీక్షించాలని వ్యవసాయ శాఖ జిల్లాకు లక్ష్యాన్ని ఇచ్చింది. కర్నూలు సబ్ డివిజన్‌లో 11,210, ఎమ్మిగనూరు సబ్ డివిజన్‌లో 8,656, ఆదోని సబ్ డివిజన్‌లో 9,860, ఆలూరు సబ్ డివిజన్‌లో 8,999, పత్తికొండ సబ్ డివిజన్‌లో 13,853 ప్రకారం మట్టి నమూనాలు సేకరించి ఎమ్మిగనూరులోని భూసార పరీక్ష కేంద్రానికి పంపాల్సి ఉంది. ఇప్పటికే వర్క్‌షాపు శాంపిల్స్ కింద 802 మట్టి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. వీటి పరీక్షలు కూడా పూర్తయ్యాయి. ఈ నెల చివరిలోగా ప్రతి ఆర్‌బీకేలో 10 ప్రకారం మొత్తం 4,660 మట్టి నమూనాలు సేకరించడం, వాటిని ల్యాబ్‌లో పరీక్షించి ఫలితాలను రైతులకు చేరవేసే విధంగా కార్యాచరణ సిద్ధమైంది. మిగిలిన మట్టి నమూనాలను ఏడాది పొడవునా నిర్వహిస్తారు. నంద్యాల జిల్లాలో 28197 మట్టి నమూనాలు సేకరిస్తారు. వీటిని కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని భూసార పరీక్ష కేంద్రానికి పంపుతారు.

ఆన్‌లైన్‌లో ఫలితాలు

మట్టి నమూనాలు సేకరణ ఇష్టారాజ్యంగా కాకుండా వ్యవసాయ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. జీపీఎస్ కో-ఆర్డినేషన్ కిందనే ఆన్‌లైన్‌లో మట్టి నమూనాలు సేకరించాల్సి ఉంది. ఇందుకోసం సాయిల్ హెల్త్‌కార్డు పోర్టల్ సిద్ధమైంది. భూసార పరీక్ష ఫలితాలను రైతులకు అందజేయడంతో పాటు ఆన్‌లైన్‌లో కూడా పెడుతారు. ప్రతి మట్టి నమూనాకు క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది.

క్లుప్తంగా

రోడ్ల పరిశుభ్రతకు ప్రత్యేక డ్రైవ్


చిన్నటేకూరులో రోడ్లను శుభ్రం చేస్తున్న దృశ్యం

కర్నూలు(అర్బన్): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రధాన రహదారులను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.నాగరాజునాయుడు తెలిపారు. గ్రామాల పరిశుభ్రతపై జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశాల మేరకు జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు, ఈఓఆర్‌డీలు ప్రత్యేక చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో భాగంగా కర్నూలు మండలం పూడిచెర్ల గ్రామంలో పర్యటించామన్నారు. ప్రతి గ్రామంలోని ప్రధాన వీధులకు ఇరుపక్కల పేరుకుపోయిన చెత్తచెదారాన్ని తొలగిస్తామన్నారు. ఆయా పంచాయతీల్లోని సిబ్బంది, క్లాప్‌మిత్రలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయనున్నట్లు చెప్పారు. ఇదే సమయంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆగస్టు 15 నుంచి పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధానికి చర్యలు చేపడతామన్నారు.

16న ఏపీ ఈఆర్‌సీ భవన నిర్మాణానికి భూమి పూజ

కర్నూలు(రాజ్‌విహార్): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ కార్యాలయ భవన నిర్మాణానికి ఈ నెల 16న భూమి పూజ నిర్వహించనున్నారు. నగర శివారులోని ఏపీ కార్బైడ్ ఫ్యాక్టరీ వద్దనున్న 220కేవీ సబ్‌స్టేషన్ ఆవరణలో ఈఆర్‌సీ కార్యాలయం నిర్మించనున్న విషయం తెలిసిందే. స్థల పరిశీలనకు కమిషన్ సెక్రటరీతో పాటు సభ్యులు ఇదివరకే వచ్చి వెళ్లారు. చివరగా ఇదే స్థలంలో కార్యాలయాన్ని నిర్మించేందుకు ఖరారు చేయడంతో 16న ఉదయం భూమి పూజ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఫెయిల్యూర్ ఖాతాలను సరిచేసుకోండి

- వైఎస్ఆర్ రైతు భరోసా జమ కాని బ్యాంకు ఖాతాలు 3,888

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ రైతు భరోసా జమ కాని బ్యాంకు ఖాతాలను సరిచేసుకునేందుకు రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. జిల్లాలో ఫెయిల్యూర్ బ్యాంకు ఖాతాలు 3,888 ఉన్నాయి. రైతులు సంబంధిత బ్యాంకులకు ఆధార్ కార్డు తీసుకెళ్లి లోపాలను సవరించుకునేందుకు శుక్రవారం వరకు అవకాశం కల్పించారు. బ్యాంకు ఖాతాలకు ఆధార్ లింక్ కాకపోవడం, మూడేళ్లుగా ఖాతాను వినియోగించకపోవడం వల్ల ఇన్‌యాక్టివ్ కావడం, కొంతమంది రైతులు బ్యాంకు ఖాతాలను క్లోజ్ చేసుకోవడం తదితర కారణాల వల్ల వైఎస్ఆర్ రైతు భరోసా పెట్టుబడి సాయం జమ కావడంలో సమస్య తలెత్తింది. సమస్యను పరిష్కరించుకుంటే శనివారం నుంచి బ్యాంకు ఖాతాలకు నగదు జమ అవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ఫెయిల్యూర్ బ్యాంకు ఖాతాల వివరాలను సంబంధిత రైతు భరోసా కేంద్రాలకు పంపినట్లు వెల్లడించారు.

ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(లీగల్): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ ద్వారా అందిస్తున్న ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకట నాగశ్రీనివాసరావు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎస్.మనోహర్ అన్నారు. మహిళా జైలు, పంచలింగాలలో ఉన్న జిల్లా జైలును బుధవారం వారు సందర్శించారు. అక్కడ ఉన్న ఖైదీల వివరాలను సంబంధిత జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందించే భోజన సదుపాయాలను స్వయంగా పరిశీలించారు. ఖైదీలకు ఉచిత న్యాయ సేవల గురించి వివరించారు. 65 సంవత్సరాలు పైబడిన ఖైదీల వివరాలు సేకరించారు. అనంతరం ఖైదీల హాజరు పట్టికను పరిశీలించి, ఖైదీలకు ఏదైనా సమస్య వస్తే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించాలని చెప్పారు. వంట గదులు, జైలు గదులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలను ఇచ్చారు. జిల్లా సూపరింటెండెంట్ ధనేనాయక్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(హాస్పిటల్): యువత అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రెడ్‌క్రాస్ రక్తనిధి ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రక్తదానం చేస్తున్న యువతను ఆమె అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఒక వ్యక్తికి రక్తదానం చేయడం వల్ల ఒక కుటుంబానికి సహాయం చేసిన వారమవుతామన్నారు. దీనిని ఒక మంచి అలవాటుగా చేసుకుని స్వార్థం లేకుండా సహాయం చేస్తూ ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని సూచించారు. అత్యవసర సమయంలో సాయం చేసేవారు దేవుడితో సమానమన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ సొసైటీ చైర్మన్ డాక్టర్ కేజీ గోవిందరెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ఐదువేల మంది రక్తదానం చేశారని, ఈ యేడాది పదివేల యూనిట్లు రక్తసేకరణ చేస్తామన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి, రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారికి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బి. రామగిడ్డయ్య, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్. భాస్కర్, డీపీఎం అలీ హైదర్, రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ మహేంద్రకుమార్, సభ్యులు శ్రీనివాసులు, కెవి. సుబ్బారెడ్డి, అరుణ, బాబురాజు, మీనాక్షి, నరసింహ, ప్రభాకర్‌రెడ్డి, మధుసూదన్, భీమశంకర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామచంద్రరావు, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కలెక్టర్ సృజన

ఈ-కేవైసీ చేయించుకుంటేనే 'పీఎం కిసాన్'

కర్నూలు(అగ్రికల్చర్): పీఎం కిసాన్ లబ్ధి పొందే రైతులు విధిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని అధికార వర్గాలు తెలిపాయి. రైతుభరోసా కేంద్రాల ఇన్‌చార్జీలతో పీఎం కిసాన్ మొబైల్ యాప్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవడం సులభమని వారు పేర్కొన్నారు. జిల్లాలో పీఎం కిసాన్ కింద లబ్ధిపొందే రైతులు 2,57,042 మంది ఉన్నారు. ఇప్పటి వరకు 2,21,805 మంది(86 శాతం) ఈ-కేవైసీ చేయించుకున్నారు. 35,238 మంది ఇంకా ఈ-కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. ఈ-కేవైసీ చేయించుకోకపోతే పీఎం కిసాన్ సాయం బ్యాంకు ఖాతాలకు జమ అయ్యే అవకాశం లేదని అధికారులు వెల్లడించారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కర్నూలు: కర్నూలు శివారులోని ఎఫ్‌సీఐ కాలనీలో భారతి (25) అనే మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. గోస్పాడు మండలం జీనేపల్లి గ్రామానికి చెందిన నాగరాజుతో ఈమెకు ఏడేళ్ల క్రితం వివాహమైంది. కొంతకాలం బుధవారపేట రాజీవ్ గృహకల్పలో నివాసముండేవారు. అయితే సంతానం కలగని కారణంగా గొడవ పడి కొంతకాలంగా భర్తకు ఈమె దూరంగా ఉంటోంది. కర్నూలు ఎఫ్‌సీఐ కాలనీలో అక్క ఇంట్లో ఉండేది. అయితే మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో అక్క ఇంట్లో గడపమాను దాటుతూ కింద పడగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. గడపమాను దాటుతూ కింద పడి మృతి చెందడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నేడు సచివాలయ ఉద్యోగుల బదిలీలు

- ఐదు కార్యాలయాల్లో ఆయా శాఖల ఉద్యోగులకు కౌన్సెలింగ్


కర్నూలు(అర్బన్): జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల బదిలీలను ఈ నెల 15న నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బదిలీలకు అర్హులైన ఉద్యోగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గత మే 28వ తేది వరకు గడువు ఇచ్చిందన్నారు. అలాగే ఈ నెల 10న (ఒక్క రోజు) మరో అవకాశం కూడా కల్పించిందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి ఐదు కార్యాలయాల్లో కౌన్సెలింగ్ ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామన్నారు.

ఉద్యోగుల వారీగా కౌన్సెలింగ్ నిర్వహణ ప్రాంతాలు

జిల్లా పరిషత్ సమావేశ భవనంలో: పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5, 6.. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిసెంట్లు.
జెడ్పీ ప్రాంగణంలోని పీఆర్ ఎస్ఈ కార్యాలయంలో: ఇంజనీరింగ్ అసిస్టెంట్లు.
కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియం: సర్వే అసిస్టెంట్లు, వీఆర్‌ఓ అండ్ వార్డు రెవెన్యూ సెక్రెటరీలు.
జిల్లా ఎస్పీ కార్యాలయం: మహిళా పోలీసు అండ్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్, వార్డు ఉమెన్ అండ్ వీకర్ సెక్షన్ ప్రొటెక్షన్ సెక్రెటరీలు.
డీఎం అండ్ హెచ్‌ఓ కార్యాలయం: ఏఎన్ఎం అండ్ వార్డు హెల్త్ సెక్రెటరీలు.
మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం: వార్డు సచివాలయ ఉద్యోగులు.

బనవాసిలో చేపల పెంపకం యూనిట్

- రూ. 7లక్షల నాబార్డు నిధులతో ఏర్పాటు
- రాష్ట్రంలో మొట్టమొదటిది ఇదే


యూనిట్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కేవీకే సమన్వయకర్త డాక్టర్ సుజాతమ్మ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో రూ. 7 లక్షల వ్యయంతో బయో ఫ్లాక్ (చేపల పెంపకం) యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కేవీకే సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ పేర్కొన్నారు. బుధవారం బనవాసి కేవీకేలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మొట్టమొదట చేపల పెంపకం యూనిట్ బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలోనే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నాబార్డ్ సంస్థ రూ. 7 లక్షల నిధులతో ఈ యూనిట్‌కు శ్రీకారం చుట్టిందని, పనులు ఈ నెలాఖరు లోపు పూర్తవుతాయని తెలిపారు. చేపల పెంపకాన్ని జూలై నెలాఖరులో ప్రారంభించనున్నట్లు చెప్పారు. యూనిట్‌లో మూడు రింగ్‌లను ఏర్పాటు చేశామని, ఒక్కొక్కదాంటో 600 చేపలను పెంచవచ్చునని, విజయవాడ నుంచి వీటిని తెప్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈమెతో పాటు కేవీకే వెటర్నరీ శాస్త్రవేత్త డా.నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

పత్తిలో ఎర్ర తెగులు

పత్తిలో ఎర్ర తెగులు ఎక్కువగా ఉన్నట్లు కేవీకే సమన్వయకర్త, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుజాతమ్మ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఎండలు ఎక్కువగా ఉండటం వల్ల మొక్కలు పోషకాలను తీసుకోలేకపోతున్నాయని, ఫలితంగా ఎర్ర తెగులు వస్తోందని చెప్పారు. నివారణకు పొటాషియం నైట్రేట్ 5 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వారం వ్యవధిలో ఫార్ములా-4.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.



జీవితాన్ని 'కల'గంటూ!

పని దైవంతో సమానం. ఎలాంటి పని చేస్తున్నామని కాదు, ఎంత నిబద్ధతతో చేస్తున్నామనేది ముఖ్యం. చెత్తను చూస్తే చాలు.. ముక్కు మూసుకొని నడకలోనే పరుగు తీస్తాం. అలాంటిది ఈ యువకులు ఆ చెత్తలోనే జీవితం వెతుక్కుంటున్నారు. రేపటి రోజును అందంగా తీర్చిదిద్దేందుకు శ్రమిస్తున్నారు. ఇదే సమయంలో చెత్తగా మారిన ఓ సోఫాలోనే ఎండకు అలసిపోయిన ఓ యువకుడు కాస్తంత కునుకుతీసిన దృశ్యం ఆ దారిన వెళ్లే వారి హృదయాలను కలచివేసింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు